క్లుప్తంగా

తెల్లపశువులకు వ్యాక్సిన్

బల్లికురవ: మండలంలోని పశువైద్యశాలల ద్వారా ముద్ద చర్మవ్యాధి సోకకుండా ఆవులు, ఎడ్లకు ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి పీ. మహేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి గొర్రెలకు ఈని నాలుక వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేస్తామన్నారు. అవకాశాన్ని పశుపోషకులు గొర్రెల పెంపకందారులు వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆషాఢ మాసం, స్వాతి నక్షత్రం, నవమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం , మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

కారు అదుపుతప్పి బోల్తా



బోల్తా కొట్టిన కారు

జే.పంగులూరు: కారు అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటన ఆదివారం పంగులూరు మండలంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. పంగులూరు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గన్నవరపు కోటేశ్వరరావు తన బంధువులను ముప్పవరం వెళ్లి బస్సు ఎక్కించేందుకు కారులో వెళ్లి వారిని దింపి మళ్లీ పంగులూరు వస్తున్నాడు. ఈక్రమంలో పంగులూరు–ముప్పవరం రోడ్డులో ఉన్న సంగం డెయిరీ వద్దకు రాగానే కారు అదుపుతప్పి స్తంభానికి ఢీకొని బోల్తా కొట్టింది. ఈఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షేమంగా ఇంటికి చేరారు. కారు మాత్రం పాక్షికంగా దెబ్బతింది.

పుణ్యక్షేత్రాల్లో నృత్య ప్రదర్శనలకు ఒంగోలు విద్యార్థులు

ఒంగోలు మెట్రో: దేశంలోని రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నృత్య ప్రదర్శనల కోసం ఒంగోలుకు చెందిన నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ విద్యార్థులకు అవకాశం లభించింది. ఆ మేరకు సంబంధిత నిర్వాహకులు ఆహ్వానం పంపారు. గురుపూర్ణిమ సందర్భంగా ఈ నెల 15, 16 తేదీల్లో మహారాష్ట్రలోని షిర్డీ సంస్థాన్ వారు శ్రీ షిర్డీ సాయి దివ్య చరితం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. అదేవిధంగా కంచి కామకోటి పీఠాధిపతులు, శంకర విజయేంద్ర సరస్వతిస్వామివారి చాతుర్మాస దీక్ష ప్రారంభ సందర్భంగా తమిళనాడు, కాంచీపురం పట్టణంలోని ఒరిక్కై మండపంలో 24వ తేదీ స్వామివారి సమక్షంలో నళినీ ప్రియ కూచిపూడి నృత్య నికేతన్ విద్యార్థులు శంకర విజయం కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శిస్తారు. ఇటువంటి రెండు గొప్ప అవకాశాలు లభించినందుకు నృత్య దర్శకురాలు, సంస్థ నిర్వాహకురాలు ఎస్వీ శివకుమారి సంతోషం వ్యక్తం చేశారు. తెలుగువారి ప్రాముఖ్యమైన కూచిపూడి నృత్య కళకు తమ వంతు సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమెను నగరానికి చెందిన వివిధ కళా సంస్థల వారు అభినందించారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని కోరారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

భౌ అంటేనే భయం !

- వేటపాలెంలో కుక్కలు స్వైర విహారం
- వెంటాడి కరుస్తున్న వైనం
- కుక్కల దాడిలో ఐదు లేగ దూడలు మృతి
- మరో ఐదు దూడలకు తీవ్రగాయాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



కుక్కల దాడిలో గాయపడిన లేగ దూడ



వీధి కుక్కలు

వేటపాలెం: కుక్కలు మనకు ఎదురొచ్చినా మనకే రిస్క్.. మనం వాటి ఎదురుగా ఉన్నా మనకే రిస్క్ అన్న డైలాగ్ సరిగా సరిపోతుంది. ఆవిధుల్లో ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లామా అంతే.. కుక్కలు సింహాల వలే ఒక్క దూకుదూకి దాడిచేస్తున్నాయి. ఆవీధుల్లో ఎటూ చూసినా కుక్కలు కనబడుతూ తిరిగే వారికి ఓర చూపు చూస్తూ భౌ..భౌమంటూ వెంటపడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అలు పాలకులు.. ఇటు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. వేటపాలెం పంచాయతీ పనితీరు మేడిపండులా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంటి పన్నులు, వివిధ రూపాల్లో లక్షల్లో ప్రజాధనం వసూలు చేస్తున్నా పంచాయతీ అధికారులు ఈ కుక్కల సమస్యకు చెక్ పెట్ట లేకపోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నానాటికీ పెరుగుతున్న కుక్కల బెడద..

గ్రామాల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. దీనితో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ ఇంట్లో నుంచి బయటకు వచ్చి రాకపోకలు సాగిస్తున్నారు. మనుషులకే కుక్కల బెడద ఎక్కువగా ఉందనుకుంటే పొరబడినట్టే మూగ జీవాలైన పశువులు, గొర్రెలు వీటి బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. వేటపాలెంలో ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. గ్రామంలో దాదాపుగా 1500 కుక్కలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. కుక్కల బారిన పడిన వారు ప్రతి రోజూ ఆరుగురు లేదా ఏడుగురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరుగులు తీస్తున్నారు. కేవలం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే వారి సంఖ్య మాత్రమే ఇది. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లే వారి వివరాలు ఇంకా ఎక్కువగానే ఉంటుందని సమాచారం. ముఖ్యంగా గ్రామంలో మార్కెట్ సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, చిన్నబజార్, ఓరుగంటి రెడ్డి వీధి, పాకనాటిరెడ్డి వీధి, ప్రధాన రహదారుల వెంట కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. మండల పరిధిలో దాదాపు అన్ని చోట్ల శునకాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రధాన రహదారిలో రాత్రి వేళల్లో వాహనదారులను వెంటాడి మరీ కరుస్తున్నాయి. రాత్రి సమయంలో గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేస్తున్న కుక్కల సమూహాలను చూసి పాదచారులు, వాహనదారులు బెంబేలెత్తి పోతున్నారు.

లేగ దూడలపై కుక్కల గుంపుల దాడులు..

అర్ధరాత్రి వేళల్లో కుక్కల గుంపులు వీధుల్లో స్వైర విహారం చేస్తూ పశుల పాకలో ఉంచి కట్టి వేసిన లేగ దూడలపై దాడులు చేస్తున్నాయి. స్థానిక పాకనాటి రెడ్డి వీధిలో మూడు రోజుల వ్యవధిలో పదిపైనే ఉన్న దూడలపై కుక్కల గుంపులు దాడులకు తెగబడ్డాయి. ఈ దాడుల్లో ఐదు దూడలు మృత్యువాత పడగా మరో ఐదు తీవ్ర గాయాలపాలయ్యాయి. లక్షలు పెట్టి పాడి పశువుల కొనుగోలు చేసుకుంటున్న రైతులకు ఈ కుక్కల గుంపులతో ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పశుపోషకులు బృందాలుగా ఏర్పడి కుక్కల రాకుండా తమ పశులకు కాపలా కాసుకుంటున్నారు. ఈ బాధలు ఎన్ని రోజులు పడాలని పశుపోషకులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల దృష్టికి కుక్కల దృష్టిని తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతుందని వాపోతున్నారు. ఉన్నత అధికారులు కల్పించుకొని కుక్కల బారి నుంచి తమ పశువులను, ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

రెండు దూడలు చనిపోయాయి..



నేను వ్యవసాయంపై ఆధార పడి కుటుంబ పోషణ చేసుకుంటాను. నాకు పశుపోషణ కూడా ఉంది. రెండు రోజుల కిందట పశువుల పాకలో ఉన్న మూడు లేగ దూడలపై కుక్కల గుంపు అర్ధరాత్రి వేళలో దాడి చేశాయి. తెల్లవారి వెళ్లి చూసేసరికి అందులో రెండు దూడలు చనిపోయి ఉన్నాయి. మరో దూడ తీవ్రగాయాతతో బాధపడుతోంది. కుక్కల బారి నుంచి పశువులను కాపాడాలని కోరుతున్నాం.

– బీ శ్రీనివాసరెడ్డి, పశుపోషకులు, వేటపాలెం

కుక్కల దాడిలో దూడ చనిపోయింది..



నేను పశుపోషణతో జీవిస్తుంటాను. రెండు రోజుల కిందట పశువుల పాకలో ఉంచిన పశువులపై రాత్రి వేళల్లో కుక్కల గుంపు దాడి చేశాయి. తెల్లవారి పశువుల పాక వద్దకు వచ్చి చూడగా ఒక లేగ దూడను కుక్కలు విపరీతంగా కరవడంతో చనిపోయి ఉంది. పగలు, రాత్రి వేళల్లో కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. వీటిని నిర్మూలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– దండా వసుంధరాదేవి, వేటపాలెం

వైభవంగా పోలేరమ్మతల్లి కొలుపులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం ఉదయం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నంఅమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రికి గ్రామంలోని మాస్కో బజారుకు చెందిన రైతన్నల బిడ్డలు, యువతీ, యువకులు పెద్ద ఎత్తున అమ్మవారి జాతరలో చిందులేశారు. అమ్మవారికి వీరతాళ్లతో నృత్యాలు చేశారు. బాణా సంచాలు కాలుస్తూ, కనకతప్పెట్లతో గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో అమ్మవారి చిత్రపటంతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంను ఊరేగించారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సంక్షేమ సంఘ సభ్యులు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ సాయినగర్‌కి చెందిన పేద దేవాంగ విద్యార్థుల చదువుకి జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుర్మా రాహుల్జి మాట్లాడుతూ పేద దేవాంగ చేనేత కార్మికుడు పసుమర్తి మధుమోహనరావు గత కొంతకాలంగా పక్షవాతంతో అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు రాధిక, నాగవేణి ఇంజినీరింగ్ చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం, వైద్య సహాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాశిక వీరభద్రయ్య, బండ్ల బాబు, చింతా రాము, భూషణ్ శ్రీనివాసరావు, పృథ్వీ ఆదిశేషు, నాసిక శివాజీ, పింజల శ్రీనివాసరావు, దేవన విజయలక్ష్మి పాల్గొన్నారు.

మేదరమెట్లలో తొలి నేత్రదానం



మృతదేహం వద్ద రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు, కుటుంబ సభ్యులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన విశ్రాంత పశువైద్యశాఖ ఉద్యోగి శంకుల ప్రసాదలింగం (75) ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల సమ్మతి మేరకు ప్రసాదలింగం నేత్రాలను రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు వచ్చి నేత్రాలను సేకరించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళి సుధాకర రావు మాట్లాడుతూ ఒకరి నేత్రాలను దానం చేయడం వలన మరో ఇద్దరికి చూపు ఇచ్చిన వారవుతారని పేర్కొన్నారు. అలాగే ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీభద్రారెడ్డి ప్రసాదలింగం మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆన్‌లైన్ విధానంపై రోటరీ అధ్యక్షులకు శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న అయా మండలాల క్లబ్ సభ్యులు

చినగంజాం: రోటరీ క్లబ్ నిర్వహించే అన్ని సేవా కార్యక్రమాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియపై అధ్యక్ష కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ ఇచ్చినట్లు సహాయ గవర్నర్ తేళ్ల రమేష్‌చంద్ర తెలిపారు. ఆదివారం స్థానిక నాగుబడి రంగయ్య బధిరుల పాఠశాలలో పర్చూరు, ఇంకొల్లు, జే. పంగులూరు, చీరాల, వేటపాలెం, మండలాల అధ్యక్ష కార్యదర్శులకు నన్నపనేని బాలకృష్ణ, గరిమిడి జగన్‌మోహన్‌రావు శిక్షణ ఇచ్చారు. రోటరీ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచటం ద్వారా ఉన్నతాధికారులు వెంటనే స్పందించటానికి అవకాశం ఉంటుందని రమేష్‌చంద్ర తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, ఇంకొల్లు, చీరాల, వేటపాలెం, జె.పంగులూరు, రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన వ్యాను



క్షతగాత్రుడు నాగేంద్రబాబు

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న లారీని బొలేరో వ్యాను ఢీకొట్టి డ్రైవర్‌కు గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని గోపాలపురం గ్రామం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం హుజురాబాద్‌కు చెందిన అల్లం నాగేంద్రబాబు తనకున్న బొలేరో వ్యానులో గొర్రెలను, మేకలను హుజురాబాద్ నుంచి చెన్నెకు తీసుకుపోయి విక్రయించి వస్తుంటాడు. ఈ నేపథ్యంలో శనివారం చెన్నె వెళ్లి తిరిగి ఆదివారం హుజురాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గ మధ్యంలో మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై అద్దంకి సమీపంలోని గోపాలపురం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈఘటనలో డ్రైవర్ గతంలో ప్రమాదంలో కాలు పోయింది మళ్లీ అదేకాలుకు గాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు

అద్దంకి రూరల్: అద్దంకిలోని భవాని సెంటర్‌లో శుక్రవారం రాత్రి ఆటో ఢీకొని గాయాలతో రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన నాయుడు (45) భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన నాయుడు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి స్థానిక భవాని సెంటర్ నుంచి దర్శిరోడ్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఆటో వేగంగా వచ్చి నాయుడును ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన నాయుడును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాల నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు వెళ్లి అక్కడే శనివారం మృతి చెందాడు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణం



చర్చి ఆవరణలో మొక్కలు నాటుతున్న చర్చి ఫాదర్, సంఘస్థులు

చీరాల రూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణం మెరుగుపడి కాలుష్య నివారణ సాధ్యపడుతుందని సెయింట్ ఆంథోని చర్చి ఫాదర్ కె. జగన్ అన్నారు. ఆదివారం మరియమ్మపేటలోని పునీత ఆంథోని ఆర్సీఎం చర్చి ఆవరణంలో ప్రత్యేకంగా మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఫాదర్ జగన్ మాట్లాడుతూ మన పరిసరాలు పచ్చని మొక్కలతో నింపడం ఎంతో ముఖ్యమని చెప్పారు. అందులో పూల మొక్కలు, క్రోటన్ మొక్కలు మనస్సుకు ఎంతో ఆహ్లాదాన్ని, ప్రశాంతతను కలిగిస్తాయని చెప్పారు. మనం నాటిన మొక్కలు పెరిగి పెద్దవై పర్యావరణాన్ని పరిరక్షించడటానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. చర్చికి వచ్చే సంఘస్థులు స్వచ్ఛందంగా తెచ్చిన మొక్కలను నాటడం ఎంతో ఆనందాన్ని కలిగించాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటికొక మొక్క చొప్పున నాటి పర్యావరణానికి పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫాదర్ నరేష్, చర్చి ప్రతినిధులు, సంఘస్థులు పాల్గొన్నారు.

దుప్పట్లు, దుస్తుల పంపిణీ



దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఫ్యామిలీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: అభాగ్యులైన పలువురికి ఫ్యామిలీ క్లబ్ 34వ సమాజ సేవలో భాగంగా ఆదివారం దుప్పట్లు, దుస్తులు, ఆహారం అందించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు రెండు భాగాలుగా విడిపోయి ట్రంకు రోడ్డు, కలెక్టరేట్, లాయర్‌పేట, కేశవస్వామిపేట తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై, ఆలయాల వద్ద ఉంటున్న అభాగ్యులకు దుప్పట్లు, దుస్తులు, ఆహారం పంపిణీ చేశారు. మడనూరు గోశాలకు దానా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వీరరాఘవరావుతో పాటు టి.వెంకటేశ్వర్లు, కే సుబ్రహ్మణ్యం, కె.వి.సురేష్, టి.శ్రీను, సీహెచ్ శ్రీహరి, ఎస్.ఫణిరాజ్, కే బాలచంద్ర ప్రసాద్, టీవీ సురేష్, పి.విజయ్‌కృష్ణ, బీకేవీ రమేష్, కేవీ చంద్రమౌళి, అరవపల్లి మధు, కోట కిరణ్, సీహెచ్‌ఆర్ సుబ్రహ్మణ్యం, శ్రీను, ఎం.రామారావు, తాతా రామకృష్ణ, ఎన్వీ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నాగులుప్పలపాడు: పచ్చదనం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని కనగాల రామకృష్ణ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉప్పుగుండూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి మొక్కను కనగాల కమలనాథం నాటడంతో పాటు గ్రామస్తులు సుమారు 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మొక్కల పెంపకంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద నుంచి ఒంగోలు బైపాస్ రోడ్డు వరకు ఇరువైపులా ప్రజలకు ఉపయోగకరమైన మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నం వెంకట్రావు, సామాజిక కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్, తూబాటి శ్రీకాంత్, భీమవరపు శివ, సాయి, గోగినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ అమలు గెజిట్ ప్రతుల దగ్ధం

పొదిలి: రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ అమలుకు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ, స్థానిక యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతులను ఆదివారం రాత్రి దగ్ధం చేశారు. విశ్వనాథపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో జిల్లా కార్యదర్శి పి.బాలవెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతుంటే దానికి విరుద్ధంగా గెజిట్ విడుదల చేయడమేమిటని ప్రశ్నించారు. బ్యాక్ డేట్‌తో జీపీఎస్ అమలుకు రాజపత్రం విడుదల చేయటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పిల్లి రమణారెడ్డి మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ రాజప్రతం విడుదల చేయటం ఈ వర్గాలను మోసపుచ్చడమేనన్నారు. పాత పెన్షన్ ఒక్కటే అంగీకారమన్నారు. జిల్లా సహాధ్యక్షుడు అబ్దుల్ హై మాట్లాడుతూ 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణం అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ద్వారా అపాయింట్ అయిన ఉపాధ్యాయులు అందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించటానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బూదాల బుజ్జిబాబు, పొదిలి మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల మండల ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, మర్రిపూడి కార్యదర్శి కోటేశ్వరరావు, యూటీఎఫ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు బాలకాశిరెడ్డి, సింగంపల్లి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, దేవప్రసాద్, గురవయ్య, పోలు శ్రీనివాసరెడ్డి, జూపల్లి వెంకటేశ్వర్లు, బీంపాటి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే ఖాశీం ,ఎం.శివారెడ్డి, కాట్రగడ్డ సుబ్బారావు, రమేష్‌రెడ్డి, గంట ఆంజనేయులు పాల్గొన్నారు.